ఇక్కడ ఆడేదెవరు?

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- మైదానాలపై కొరవడిన పర్యవేక్షణ
- గడ్డి, పిచ్చిమొక్కలు, బురదమయంగా ఆట స్థలాలు
- కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

రాజోళి: గ్రామాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడంతో పాటు, యువతకు శారీరక, మానసిక దృఢత్వాన్ని ఇచ్చేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేక, యువకులు ప్రాంగణాల్లో ఆడుకోకపోవడంతో మైదానాలు బురద, పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో నిండిపోయాయి. మండలాన్ని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అందులో ఆడే ఆటగాళ్లే కనిపించడం లేదు.

ఎన్నో కారణాలు..

ప్రభుత్వం ఆదేశించినట్లుగా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం కానీ, ఆటలైతే ఆడించలేం కదా అనేది అధికారుల వాదన. ఆటలకు సరిపడా స్థలం లేకపోవడం, మైదానాలు చిన్నగా ఉండటంతో అందులో కొన్ని రకాల ఆటలు మాత్రం ఆడగలం కాని, క్రికెట్, ఫుట్‌బాల్ లాంటి ఆటలు ఆడటానికి వీలు కాదని యువకులు పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల స్థలం తీసుకుని మైదానం ఏర్పాటు చేశారు. అందులో ఆడేందుకు వీలవుతుందా లేదా అనే ఆలోచన కూడా లేకుండా మైదానాలు ఎంపిక చేయడంతో ఆ స్థలాల్లో ఆటలకు అసలు వీలు కావడం లేదనే వాదనలున్నాయి. యువకులు ఇష్టపడే క్రికెట్‌కు సరిపడా మైదానాలు లేకపోవడంతో వారు దానికి తగిన చోటనే ఆడుతున్నారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

క్రీడా ప్రాంగణాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. మైదానాలు ఏర్పాటు చేసి, ఆడుకునే కిట్లు అందజేసి చేతులెత్తేశారు. ఆ మైదానాల్లో యువకులు ఆడుతున్నారా? లేదా అని అడిగే వారే లేరు. కొన్ని మైదానాలకు బోర్డులు లేకపోగా, మరికొన్ని చోట్ల నేలకొరిగాయి. రాత్రి అయితే మందు బాబులకు క్రీడా ప్రాంగణాలు అడ్డాగా మారుతున్నాయి. అధికారులు స్పందించి యువకులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, క్రీడా ప్రాంగణాల ప్రాముఖ్యతను తెలపాలి. అందులో ఆడగలిగే ఆటలు ఆడేలా వారిని చైతన్య పరచాలని ప్రజలు కోరుతున్నారు.

మైదానాల్లో పిచ్చి మొక్కలు, బురద

ప్రాంగణాలను నిరుపయోగంగా ఉండడం వల్ల అందులో పిచ్చి మొక్కలు, కంప చెట్లు పెరిగిపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా అది బురదమయంగా మారుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ ఉంటే మైదానాలు బురదమయంగా కాకుండా ఆడుకునేందుకు వీలుగా ఉంటాయి.


ముండ్లదిన్నెలో బోర్డు లేని క్రీడా ప్రాంగణం

చిన్న స్థలంలో ఇబ్బందికరమే..



క్రీడా ప్రాంగణాలకు కేటాయించిన స్థలం కేవలం రెండు నుంచి మూడు సెంట్ల వరకు ఉంటుంది. అందులో అన్ని రకాల ఆటలు ఆడేందుకు వీలు పడదు. అధికారులు మైదానాల ఏర్పాటు అనంతరం వాటిని పట్టించుకోలేదు. మా గ్రామంలో క్రీడా ప్రాంగణానికి బోర్డు కూడా లేదు. ఇలా చాలా గ్రామాల్లో ఇబ్బందికరంగానే మైదానాలున్నాయి. అధికారులు వాటిపై స్పందించాలి.

– ఆంజనేయులు, ముండ్లదిన్నె

పంచాయతీ సెక్రటరీలకు చెప్పాం

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో ఆడుకునేందుకు యువకులకు స్పోర్ట్ కిట్లను అందచేశాం. మైదానాలు దెబ్బతినకుండా, అందులో పిచ్చి మొక్కలు పెరగకుండా, పెరిగిన వాటిని తొలగించే విధంగా, వాటిని రెగ్యులర్‌గా పర్యవేక్షించేలా ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మైదానాల్లో మద్యం బాబులు తాగినా, ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేసినా చర్యలు తప్పవు.

– ఖాజా మెయినుద్దీన్, ఎంపీఓ, రాజోళి

క్లుప్తంగా

ఆసక్తి గల రైతులు హాజరుకావాలి

మానవపాడు: మండలంలోని 17 గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం రెండో విడత రుణమాఫీ విడుదల సందర్భంగా కలెక్టర్ కార్యాలయానికి ఆసక్తి ఉన్న రైతులు హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటలకు రెండో విడత రుణమాఫీ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు

బస్సు ఆపాలని డీఎంకు వినతి



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం స్టేజీలో వనపర్తి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సును ఆపాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఇక్కడ వివిధ డిపోలకు చెందిన బస్సులు నిలిచేవి. కొంత కాలంగా వనపర్తి డిపో బస్సులు నిలపకపోవడంతో వివిధ గ్రామాల ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మాజీ సర్పంచ్ మధునాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు వనపర్తి డిపోలో డీఎంను కలిసి వినతి పత్రం అందించారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డీఎం సూచన మేరకు 200 మంది విద్యార్థుల ఉచిత బస్సుపాసుల కోసం రూ.10,000 నగదును డిపో సిబ్బందికి అందజేసినట్లు వారు పేర్కొన్నారు.

సమావేశం విజయవంతం చేయండి

మానవపాడు: హైదరాబాద్‌లో ఈ నెల 31న నిర్వహించే అర్చక ఇనాందర్ సమావేశం విజయవంతం చేయాలని అర్చక సంఘం నాయకులు నరేంద్ర, లక్ష్మయ్య, వేణు, భీమయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.

వీధి దీపాలు లేక ఇబ్బందులు

గట్టు: మండల కేంద్రంలోని వీధుల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో చీకటి పడిన తర్వాత బయటకు రావడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారుల గుండా ఉన్న స్తంభాలతో పాటుగా వీధుల్లో కూడా బల్బులు కాలిపోవడంతో వాటిని మార్చకుండా అలానే వదిలేశారు. దీనికి తోడు డ్రెయినేజీ శుభ్రం చేయకపోవడంతో అందులో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తున్నట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేసి, డ్రెయినేజీలో చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

యువకుడిని అప్పగించిన పోలీసులు

కేటీదొడ్డి: తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడిని పోలీసుల తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన మండలంలోని మల్లాపురంలోని సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. మల్లాపురంతండాకు చెందిన విజయ్ చెడు వ్యసనాలకు బానిస కావడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఆదివారం ఇంట్లో నుంచి విజయ్ ఆత్మహత్య చేసుకుంటానని వెళ్లిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు రాత్రి 100 డయల్ చేయగా, హెడ్ కానిస్టేబుల్ రంజిత్‌కుమార్, హోంగార్డ్ శ్రీనివాసులు ఆచూకీ తెలుసుకుని యువకుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆవు మృత్యువాత


ఆవు మృత్యువాత పడడంతో రోదిస్తున్న మహిళ

మానవపాడు: బిడ్డను ఎంత ప్రేమగా పెంచుకుంటుందో అలాగే కొని సంవత్సరాలుగా పెంచుకున్న ఆవు ప్రసవ వేదనతో మృత్యువాత పడడంతో పెంచిన మహిళ కన్నీరుమున్నీరైన ఘటన సోమవారం చెన్నిపాడులో చోటుచేసుకుంది. చెన్నిపాడు గ్రామానికి చెందిన చంద్‌బాషా, నూర్జహాన్ దంపతులు కొంతకాలంగా ఆవులను పెంచుకుంటున్నారు. ఆవులపై ప్రేమతో సొంత బిడ్డలాగే పెంచారు. ఆదివారం రాత్రి ఆవు అస్వస్థతకు గురైంది. మండల కేంద్రంలోని పశువైద్య శిబిరం కంపౌండర్‌కు సమాచారం ఇచ్చారు. ఉదయం వస్తామని కంపౌండర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో ఏమి చేయాలో తెలియక రాత్రి మొత్తం దంపతులు నిద్రాహారాలు మాని ఆవుకు సేవలు చేశారు. సోమవారం ఉదయం పశువైద్య అధికారి వచ్చి ఆవుకు ప్రసవం చేసేందుకు ప్రయత్నం చేసినా, ఫలించక ఆవు, కడుపులో దూడ మృత్యువాత పడ్డాయి. దీంతో దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. ఆమె రోదన చూసిన ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు.

కలుగోట్లలో ఘనంగా పీర్ల పండుగ


పీర్ల ఊరేగింపులో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్లలో మొహర్రం పూర్తయినా 10 రోజులకు ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. సోమవారం రాత్రి పీర్లను గ్రామంలోని దర్గా నుంచి ప్రత్యేక పూజలు, ప్రార్థనలతో ఊరేగించి, తుంగభద్ర నది తీరానికి తరలించి నిమజ్జనం చేస్తారు. ఉత్సవాలకు చుట్టు పక్క ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


కలుగోట్లలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్


మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష

గద్వాల అర్బన్: కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌ను ప్రవేశపెట్టాయని వివిధ సంఘాల నాయకులు మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరై వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. బడ్జెట్‌లో నిరుద్యోగులకు, విద్యార్థులకు, పేద, మధ్య వర్గాలతో విద్యా, వైద్యం, వ్యవసాయ, కార్మిక తదితర రంగాలకు బడ్జెట్‌లో అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇది పూర్తి ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు, రైతు సంఘాల నాయకులు గోపాల్‌రావు, రామిరెడ్డి, గోపాల్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబాన్, టీపీఎఫ్ నాయకుడు ప్రభాకర్, బహుజన రాజ్యసమితి నాయకుడు వినోద్, సాదతుల్లా తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు


గద్వాలలో అప్పటి ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు


మల్దకల్ జెడ్పీహెచ్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వపు విద్యార్థులు

గద్వాల: గద్వాలలో చదివి ఉద్యోగం, వ్యాపారాలు చేస్తూ పలు ప్రాంతాల్లో స్థిరపడి చాలా సంవత్సరాల తరువాత వారంతా మళ్లీ కలిశారు. జిల్లా కేంద్రంలోని ఎంబీ ఉన్నత పాఠశాల (ఎయిడెడ్) 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ఆవరణలో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఆనాడు తరగతి గదిలో కలిసిన విద్యార్థులంతా ఒకచోట కలవడంతో సంతోషం వ్యక్తం చేశారు.

మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1989–90లో పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 35 ఏళ్ల తర్వాత ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ సమ్మేళనానికి విశ్రాంత ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, వెంకట్రాములు, తిమ్మారెడ్డితో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. పూర్వపు విద్యార్థులు వారికి పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో దామ రామక్రిష్ణ, రవీందర్ గౌడ్, సువర్ణ, మహేష్ బాబు, రమేష్ బాబు, వెంకటేష్ శెట్టి, గోవర్ధన్ గౌడ్, రామక్రిష్ణ, ధర్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, గంగాధర్ శెట్టి, శ్రీలత, విజయలక్ష్మి, శాంతమ్మ, వసంత, లోకమ్మ ఉన్నారు.

బాల్య వివాహాలు రూపుమాపుదాం


మాట్లాడుతున్న సోషల్ మొబిలైజర్ విజ్ఞ లత

గద్వాల అర్బన్: బాల్యవివాహాలను రూపుమాపుదామని సోషల్ మొబిలైజర్ విజ్ఞలత అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సంయుక్తంగా సోమవారం గద్వాల మండలంలోని ఈడిగోనిపల్లిలో బాలల హక్కులు, బాల్య వివాహాలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతూ బాధ్యతలను విస్మరించరాదన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యసాధనకు ఏకాగ్రతతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు అందజేయాలి

గద్వాల అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 40శాతానికి పైగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలకు అందలేదన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు అందజేయకపోవడం సరికాదన్నారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలల్లో 1500 మంది విద్యార్థులకు ఒక పీడీ కూడా లేరని తెలిపారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఇంగ్లిష్ మీడియం పాఠ్యపుస్తకాలు అందజేయాలని, వెంటనే పీడీలను నియమించాలని, జూనియర్ కళాశాలలకు నూతన భవనాలను నిర్మించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిధులొచ్చినా.. పైకప్పు లేదు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో 82 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు బోధన ఉండడంతో 7 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో బాత్‌రూంల కోసం రూ.2లక్షలు మంజూరయ్యాయి. బాత్‌రూంలు అరకొరగా నిర్మించి పైకప్పు లేకుండానే పనులు ముగించారు. దీంతో విద్యార్థులు మాత్రం ఆరుబయటకు మూత్రానికి వెళ్లాల్సి వస్తోంది. పిల్లలు ఆరుబయటకు వెళ్లడం వల్ల ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్య వైఖరిని వీడాలి

గద్వాల అర్బన్: పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వీడాలని జిల్లా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మౌన దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాల్వ పనులు పూర్తి చేయండి



అయిజ: నెట్టెంపాడు ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలోని బి తిమ్మాపూర్ శివారులోని పంటపొలాల్లో నిర్మించిన కాల్వ పనులు పూర్తికాకపోవడంతో పంటపొలాలకు నెట్టెంపాడు ప్రాజెక్ట్ నీళ్లు అందకుండా పోయాయి. ముచ్చోనిపల్లి రిజర్వాయర్ ద్వారా ప్రధాన కాల్వలను ఏర్పాటు చేసి హెడ్ రెగ్యులేటర్ల ద్వారా సాగునీరు అందించేందుకు ఐదేళ్లక్రితం నిర్మించిన కాల్వ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దానివల్ల సుమారు 200 వందల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయింది. అర కి.మీ. దూరం వరకు కాల్వ పనులు పూర్తిచేస్తే ఆయకట్టు పంట పొలాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కాల్వ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్

జలమయమైన రహదారి



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై రోడ్డు జలమయమైంది. మూడు రోజుల క్రితం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. అప్పటి నుంచి చిన్న తాండ్రపాడు ప్రధాన రోడ్డు నీటిలో మునిగింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రామాలయం సమీపంలో, చౌరస్తాలో గాంధీ విగ్రహం పక్కన ప్రధాన రోడ్డుపై మురుగు నిలిచింది. దీంతో రోడ్డుపై ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారు లు, ప్రజా ప్రతినిధులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే పార్టీకి వెన్నుపోటు పొడిచారు


ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల అర్బన్: అభివృద్ధి పేరుతో గద్వాల ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని, ఎమ్మెల్యే తప్ప ఎవరూ కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ మారడం దారుణమన్నారు. అభివృద్ధి పేరుతో పార్టీ మారిన ఎమ్మెల్యే ఏం అభివృద్ధిని సీఎం ముందు ఉంచారో ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు అతిఖుర్ రహ్మాన్, జయరామిరెడ్డి, రాములు, పటేల్ జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, మక్బూల్, నరసింహ, తదితరులు ఉన్నారు.

భవిష్యత్‌లో బీఆర్ఎస్‌దే అధికారం

కేటీదొడ్డి: భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని బీఆర్ఎస్ జిల్లా నాయకులు బాసు హనుమంతు నాయుడు అన్నారు. మండలంలోని పాగుంట, వెంకటాపురం, కొండాపురం తదితర గ్రామాల్లో పార్టీ నేతలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కలిసి కట్టుగా బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలన్నారు. నడిగడ్డ ప్రజలు అందరూ బీఆర్ఎస్ వైపు ఉన్నారని, పార్టీ నేతలకు ఎలాంటి కష్టం వచ్చిన అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మోనేష్, రాజునాయుడు, వీరన్న, నాగరాజు, గోవర్ధన్, నర్సింహులు, డొల్ల గోవిందు, రాజునాయుడు, ప్రహ్లాద్, రవి, స్వామి ఉన్నారు.

ఆదమరిస్తే అంతే!

రాజోళి: సుంకేసుల డ్యాం దగ్గర అధికారుల అలసత్వం ఏళ్ల తరబడి కళ్లెదురుగా కనిపిస్తూనే ఉంది. డ్యాం వెనక వైపున రక్షణ కంచెగా ఉన్న ఇనుప కడ్డీలను దుండగులు గతంలో తొలగించారు. వాటిని తొలగించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు అధికారులు అక్కడ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం లేదు. గత వేసవిలో నీరు లేకపోవడంతో నష్టంలేకపోయినా, ప్రస్తుతం డ్యాంలో వరద నీరు లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుంది. దాన్ని చూసేందుకు వేలాది మంది పర్యాటకులు అక్కడకు వస్తుంటారు. కనీస రక్షణగా ఉండాల్సిన కంచె లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన నిత్యం పర్యాటకులను వేధిస్తోంది. అక్కడ రక్షణగా ఏమీ లేకపోవడంతో నిత్యం పోలీసులు డ్యాం మొత్తం ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తున్నారు. పోలీసులు అవతలి వైపుకు వెళ్లగానే ఇటు వైపు పర్యాటకులు సెల్ఫీల కోసం డ్యాం చివరిదాకా వెళ్తున్నారు. అక్కడ కొంత ఆదమరిస్తే ఎంతటి ప్రమాదముందో ఇటు అధికారులు, అటు పర్యాటకులు మరిచిపోతున్నారు. వీలైనంత త్వరగా కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


సుంకేసుల డ్యాం దగ్గర రక్షణ కంచె లేక ప్రమాదకరంగా ఉన్న వైనం

రుణమాఫీ తీరుపై రైతుల ఆగ్రహం

మానవపాడు: తెలంగాణ ప్రభుత్వం చేసిన రుణమాఫీపై రైతుల్లో గందరగోళం ఏర్పడింది. రూ.1లక్షలోపు పంట రుణాలు మాఫీ చేశామంటూ ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో రైతుల పేర్లు లేకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల్లో సగం మందికి, మరికొన్ని బ్యాంకుల్లో కొంతమందికి, ఇంకొన్ని బ్యాంకుల్లో కొంతమందికి రుణమాఫీ లిస్ట్‌లో పేర్లు లేకపోవడంతో రైతులకు ఏం జరుగుతుందో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. అన్ని అర్హతలుండి రుణమాఫీకి నోచుకోని రైతులు వ్యవసాయ పనులను మానుకోని, వ్యవసాయ అధికారుల, బ్యాంకుల వద్దకు, సహకార సంఘాల బ్యాంకుల వద్దకు తిరుగుతున్నారు. అక్కడ సరైన సమాధానం రాకపోవడంతో 'ఇదేం పద్ధతి?' అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.1లక్ష ఉన్న ప్రతి ఒక్కరికి రుణమాఫీ అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


వ్యవసాయ సహకార కార్యాలయంలో అధికారులను రుణమాఫీపై అడుగుతున్న రైతులు

రుణమాఫీ కాలే..



స్టేట్‌బ్యాంక్‌లో రూ.1లక్ష వరకు రుణం తీసుకున్నా రుణమాఫీ కాలేదు. ఎందుకు రుణమాఫీ జరగలేదో అర్థం కావడం లేదు. వ్యవసాయ పనులు వదులుకోని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. ఉన్నతాధికారులు చొరవ చూపి రుణమాఫీ అయ్యేలా చూడాలని కోరుతున్నాం.

– పీ.మాబు, రైతు, జల్లాపురం

డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు చేయండి


గుంతలు పడిన డైవర్షన్ రోడ్డు

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్‌-కొత్త బస్టాండ్ మధ్యన పెద్ద వాగుపై గతేడాది బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పుడు ఊరు చివర ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు గుంతలు పడి ప్రయాణానికి ప్రతికూలంగా మారింది. వర్షాకాలంలో నీరు రోడ్డుపై నిలిచి మురుగు ఏర్పడింది. బురదలో వాహనాలు వెళ్లేందుకు ప్రతికూలంగా మారింది. చివరికి ఆర్టీసీ బస్సులు నడిపేందుకు డ్రైవర్లు జంకుతున్నారు. అఖిల పక్షం నాయకులు అనేక సార్లు నిరసనలు చేపట్టడంతో ఇప్పుడు ఆర్టీసీ బస్సులు డైవర్షన్ రోడ్డుపై నడుపుతున్నారు. వాహనాలు బోల్తాపడి ప్రమాదాలు జరుగకముందే డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.